క్లుప్తంగా

చేరికల కమిటీ ఏర్పాటు

స్టేషన్ మహబూబ్‌నగర్: డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బుధవారం నియోజకవర్గ నూతన చేరికల కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ కన్వీనర్‌గా సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, కోకన్వీనర్‌గా అబ్దుల్ సిరాజ్‌ఖాద్రీ, సభ్యులుగా ఎస్.వినోద్‌కుమార్, ఎ.సంజీవ్ ముదిరాజ్, ఎన్పీ.వెంకటేశ్, ఆనంద్‌గౌడ్, ఎం.సురేందర్‌రెడ్డి, బెక్కరి అనితారెడ్డి, సి.అమరేందర్‌రాజు, కె.లక్ష్మణ్‌యాదవ్‌లను నియమించినట్లు తెలిపారు.

నేడు సమావేశం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు బూత్ స్థాయి ఏజెంట్ల సమావేశం జరుగుతుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజల్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు గోవర్ధన్ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు.

బిల్లుల చెల్లింపు శుభపరిణామం

స్టేషన్ మహబూబ్‌నగర్: రెండేళ్లుగా ఈకుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్లులను ప్రభుత్వ దశలవారీగా చెల్లింపులు ప్రారంభించడం శుభపరిణామమని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇది అనేక పర్యాయాలు ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తుల ఫలితమేనని వివరించారు. నెలాఖరులోగా అన్ని బిల్లులు ఉద్యోగస్తులకు చెల్లింపు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

నేటి నుంచి షబీనా తరావీ

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని లక్ష్మీనగర్‌కాలనీలో గురువారం నుంచి ఈనెల 26 వరకు ఆరు రోజుల షబీనా తరావీ నమాజ్ పఠించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు హాఫీజ్ మహ్మద్ రఫియొద్దీన్ ఫైజీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తరావీ నమాజ్ రాత్రి 8.30 గంటలకు ప్రారంభమవుతుందని, మహిళలకు ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు వివరించారు.

పరామర్శ

నవాబుపేట: మండల పరిధిలోని యన్మన్‌గండ్ల గ్రామంలో నీలకంఠరెడ్డి భార్య అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. స్పోర్ట్స్‌అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఉమాపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని యునైటెడ్ ముస్లిం అడ్వైజరీ ఫోరం కన్వీనర్ గులాం గౌస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ముస్లిం సంక్షేమానికి పలు ప్రతిపాదనలు ఇచ్చామని.. సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. ఫోరం కోకన్వీనర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్: మండలంలోని మాచారంలో మాజీ ఉపసర్పంచ్ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎల్‌ఆర్ చలివేంద్రాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డా. లక్ష్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ సేవాకార్యక్రమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

మల్లు రవికి ఘన సన్మానం

నవాబుపేట: పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి బుధవారం ఢిల్లీ నుంచి రావటంతో ఆయనను ఎయిర్‌పోర్టులో కలిసి మండల నాయకులు ఘనంగా సన్మానించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి బంగ్లారవి, పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, ఖాజా, అజహర్‌ఆలీ, మల్లేష్‌యాదవ్, రాజేష్, శ్రీహరి ఉన్నారు.

కార్యకర్తలు అమ్ముడు పోరు

- వారికి బీజేపీ అభ్యర్థి ఫోన్లు చేయడం సిగ్గుచేటు
- కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ కార్యకర్తలకు బీజేపీ అభ్యర్థి ఫోన్లు చేసి ఎన్నికల్లో మద్దతు తెలపమని అడుగుతుండడం సిగ్గుచేటని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం హన్వాడ మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే వ్యతిరేకిస్తున్నారని అన్నారు. తమ కార్యకర్తలను ఆమె ఓట్లు వేయమని అడుగుతుండడం నైతికత కాదన్నారు. ఆమెకు వారి పార్టీ నాయకులు, కార్యకర్తలపై విశ్వాసం లేక కాంగ్రెస్ వారికి ఫోన్లు చేస్తున్నారా అని ప్రశ్నించారు. తాను ఏ ఒక్క బీజేపీ నాయకుడు, కార్యకర్తకు ఫోన్ చేసి అడిగినట్లు నిరూపించినా.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయనని, నామినేషన్ కూడా వేయనని అన్నారు. మోదీ వచ్చినా మా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డబ్బులకు అమ్ముడుపోరని, మూడు జెండాల పార్టీని వదిలిపెట్టరని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి గతంలో ఎంపీగా ఉండి లోక్‌సభ నియోజకవర్గానికి చేసిందేమిలేదని, చాలా మందికి ఆయన ఎంపీ అనే విషయమే తెలియదన్నారు. ఈ ఎన్నికల్లో నైతిక విజయం కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో హన్వాడ మండలం నుంచి 10వేల మెజార్టీ వస్తే తాను ఎంపీగా గెలుపొందిన తర్వాత మండలానికి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరానికి నీళ్లు తీసుకొస్తానని తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. టీవీలో కనిపించే మోదీ ఏ అభివృద్ధి చేయదని, ఏ నాయకుడు, కార్యకర్తకు సైతం మోదీ దర్శనం దొరకదని, ఇక సామాన్యుడి సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. వంశీచంద్‌రెడ్డిని ఎంపీగా గెలిపిస్తే జిల్లాకు ఎక్కువ నిధులు తెచ్చి అభివృద్ధి చేసుకునేందుకు మంచి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు వినోద్‌కుమార్, ఎం.సురేందర్‌రెడ్డి, ఎన్పీ.వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, చంద్రకుమార్‌గౌడ్, హనీఫ్ అహ్మద్, విజయ్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, ఫయాజ్, అజ్మత్‌అలీ, నర్సింహారెడ్డి, మహేందర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

సీసీ నిర్మాణానికి భూమిపూజ



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గండీడ్: మండల కేంద్రంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. గ్రామంలో శివాలయం వద్ద నుంచి పనులు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. గండీడ్ ఎంపీటీసీ బాలయ్య, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రావు, మల్కయ్య, శేఖర్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాల్సిందే



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్

నవాబుపేట: వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని.. విధి నిర్వహణలో సమయపాలన పాటించాల్సిందేనని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మరికల్ సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల విషయంలో చేపట్టిన ముందు జాగ్రత్త చర్యలపై సిబ్బందిని ప్రశంసించారు. శరభలింగం, శ్రీనివాస్, రాములు, రాఘవేందర్, అవినాష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం



పెద్ద ఆదిరాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు. బుధవారం పెద్ద ఆదిరాల, చిన్న ఆదిరాల గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ తదితర సమస్యలు లేకుండా చేస్తామన్నారు. ఎన్నికల అనంతరం యధావిధిగా సంక్షేమ పథకాలు అమలవుతాయని అన్నారు. రాములు, వెంకటయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు.

ఆన్‌లైన్ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

బాలానగర్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ కంప్యూటర్ కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిచాలని, సమస్యలతో వచ్చిన వ్యక్తులకు ఓపికతో సమాధానం ఇవ్వాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తోచిన మార్గాన్ని నిర్దేశించాలని అన్నారు. అనంతరం కాంగ్రెస్ కార్యకర్త మోహన్ నాయక్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆయన కేక్‌కట్ చేసి తినిపించారు. కార్యకర్తలు, ప్రజలే తమకు బలమన్నారు. శంకర్ నాయక్, తిరుపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, హనుమంత్ నాయక్, బీల్యానాయక్ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నర్సింహులు

గండీడ్: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్‌డీఓ నర్సింహులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో పనుల నిర్వహణపై సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో 75 మందికి తగ్గకుండా కూలీలు ఉండేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలోనూ సంఖ్య చాలా తక్కువగా ఉందని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులకు రాకపోవడంపై విచారణ చేశారు. కాగా పలువురు సిబ్బంది డబ్బులు సకాలంలో రాకపోవడంతో పనుల్లోకి రావడానికి ఆసక్తి చూపడం లేదన్నారు. దీంతో డీఆర్‌డీఓ స్పందిస్తూ సకాలంలో డబ్బులు అందేలా చూస్తామన్నారు. ఏపీఓ హరిశ్చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ముగింపు

జడ్చర్ల టౌన్: నవజీవన్ రూరల్‌డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో 45రోజులుగా నిర్వహిస్తున్న టైలరింగ్, మగ్గం వర్క్ శిక్షణ బుధవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడు ఫాదర్ రాజారెడ్డి మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగాలని, అందుకోసం తాము ఇచ్చిన శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉన్నతమైన లక్ష్యం వైపు దృష్టిసారించి సాధించేందుకు కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మర్రెడ్డి, కో ఆర్డినేటర్ మార్తడేవిడ్, శిక్షకులు రఫియా, శ్రీలత పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

పోలింగ్ నిర్వహణ ఖర్చులు పూర్తిగా ఇవ్వండి



వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

మహమ్మదాబాద్: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం ఆయా గ్రామాల్లో కార్యదర్శులు పెట్టిన ఖర్చులకు సంబంధించిన డబ్బులు పూర్తిగా ఇవ్వాలని.. అలాగే బీఎల్‌ఓలు, మోడల్ ఆఫీసర్‌లుగా విధులు నిర్వహించిన వారికి డబ్బులు ఇవ్వాలని తహసీల్దార్ తిరుపతయ్యకు బుధవారం వినతిపత్రం అందించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌కు రూ.3వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.1500 ఇచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు హాజీ, రాఘవేందర్, రవి తదితరులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం



కోయిల్ కొండ: గర్భిణులు, చిన్నారులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జగదీశ్వరి సూచించారు. బుధవారం కాస్లుబండతండా పరిధిలోని కల్యాణ్‌నగర్‌లోని అంగన్‌వాడీలో పోషణ పక్షవారోత్సవాలను నిర్వహించారు.

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ 1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహారంపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్ రమేష్, అంగన్‌వాడీ టీచర్ సుజాతపాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీమ్ సుల్తానా మహబూబ్‌నగర్ పట్టణంలోని తెలుగువీధి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిప్పర్ల అడ్డగింత

మిడ్జిల్: అయ్యవారిపల్లిలో సీజ్ చేసిన ఇసుకను మహబూబ్‌నగర్ ఆస్పత్రి నిర్మాణానికి అంటూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బుధవారం ఆరోపించారు. ఇసుక తరలిస్తున్న టిప్పర్లను రాణిపేట్ వద్ద అడ్డుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కాగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. రాజేశ్వర్, తిరుపతి, నరేందర్,ఎంపీపీ సుదర్శన్, ప్రతాప్‌రెడ్డి, పాండు, తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు నిధుల సేకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఏబీవీపీ ఆధ్వర్యంలో 'సకోరా' అభియాన్ కార్యక్రమంలో భాగంగా వన్యప్రాణుల సంరక్షణకు నిధులను సేకరించారు. ఈమేరకు నిధులతో వేసవిలో పక్షులకు, జంతువులను నీటిని తొట్లు ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, కృష్ణ, జైపాల్, నీరేష్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఓ షాపులో బుధవారం తనిఖీలు చేపట్టిన పోలీసులు అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు వెంకటేష్ షాపులో తనిఖీ చేయగా 12 బీరు సీసాలు, 39 క్వార్టర్ సీసాలు పట్టుబడ్డాయి. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేయింగ్ మిషన్ వితరణ

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బుధవారం గ్రామానికి చెందిన యువకుడు తఖీబాబా డిజిటల్ వేయింగ్ మిషన్‌ను అందజేశారు. ఈ మేరకు అతడికి వైద్యసిబ్బంది, ఆశకార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.

కౌన్సిలర్ భర్తపై చర్యలకు డిమాండ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పిల్లలమర్రి ఎర్రవల్లి తండాలో ఎల్‌ఈడీ లైట్లు బిగిస్తున్న కాంట్రాక్టు కార్మికులు మహ్మద్ మోసిన్, చిన్నపై దాడికి పాల్పడిన కౌన్సిలర్ భర్తపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ టౌన్ కన్వీనర్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. కాలనీవాసులు చాలా రోజులైంది లైట్లు బిగించలేదని అడగగా..కౌన్సిలర్‌కు సమాచారమిస్తే గ్రామానికి చేరుకున్న ఆమె భర్త కార్మికులను దుర్భాషలాడారని ఆరోపించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి బాధితులను నాయకులు నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్ పరామర్శించినట్లు తెలిపారు.

2వ వార్డులో పర్యటన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక రెండో వార్డు పరిధిలోని బృందావన్ కాలనీలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్లు, మురుగుకాల్వలు పూర్తి చేయాలని, వీధి దీపాలు అమర్చాలని స్థానికులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. కాగా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు గంజి వెంకట్రాములు, కృష్ణమూర్తి, వెంకటేష్, కాలనీవాసులు రవిప్రకాష్, టి.జగన్‌మోహన్, శ్రీనివాసులు, లక్ష్మణ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న చైర్మన్ బస్వరాజ్ గౌడ్

భూత్పూర్: మహబూబ్‌నగర్ జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడంపై మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్, మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాల మేరకు అప్పట్లో పార్టీ నాయకులను కాదని జెడ్పీటీసీగా స్వర్ణ సుధాకర్‌రెడ్డి గెలిపించామని అన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవతో జెడ్పీచైర్ పర్సన్ ఆమెకు అవకాశం ఇచ్చారని పేర్కొన్నారు. కానీ ఆమె పార్టీ చేసిన మేలు మరిచారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం కాదు.. పదవికీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, సీనియర్ నాయకులు నారాయణ గౌడ్, సత్యనారాయణ, మహ్మద్ సాధిక్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



దమగ్నాపురంలో వేడుకలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో పునర్నిర్మాణం చేపట్టిన జములమ్మ ఆలయం వద్ద బుధవారం విగ్రహ పునఃప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండితుడు మణికంఠ శివాచార్య ఆధ్వర్యంలో యంత్రస్థాపన, బింబస్థాపన, మూలమంత్ర హోమం, ప్రాణప్రతిష్ఠ వంటి ప్రత్యేక పూజలు చేసి జములమ్మ, బంగారమ్మ అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠ చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయం వద్ద బీజేపీ నాయకుడు మున్నూర్ రమేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

దమగ్నాపురంలో..

చిన్నచింతకుంట: దమగ్నాపురంలో మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి కవిత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమానికి మాజీ సర్పంచ్ జి. హన్మంత్‌రెడ్డి తోపాటు పలువురు గ్రామస్తులు తదితరులు హాజరయ్యారు.

తనిఖీలు ముమ్మరం

- ఒకే రోజు రూ.15.96లక్షలు సీజ్
- మహబూబ్‌నగర్‌లో ఐదు చోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులు ప్రారంభం
- జడ్చర్లలో మద్యంతో పాటు సారా సీజ్



శాఖాపూర్ వద్ద తనిఖీలు



నంచర్ల గేట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ క్రైం/అడ్డాకుల: సార్వత్రిక సమరానికి షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఇందుకోసం ప్రత్యేక నిఘా బృందాలను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. జిల్లా పోలీస్ శాఖ నగదు అక్రమ రవాణా, మద్యం పంపిణీకి అడ్డుకట్ట వేసేలా పోలీసులు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల సహకారంతో అనుసంధానమైన కమాండ్‌కంట్రోల్ కేంద్రంలో సిబ్బంది 24గంటల పాటు కెమెరాల ద్వారా అందుతున్న సమాచారాన్ని పరిశీలన చేయనున్నారు.

- ప్రధానంగా నగదు, మద్యం తరలించే పలు రకాల వాహనాలను ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రతి పోలీస్‌స్టేషన్ వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ప్రధాన రోడ్లతో పాటు చౌరస్తాలు, మండల కేంద్రాల్లో విస్తృతంగా తనిఖీలు చేయగా రూ.15.96లక్షల నగదు పట్టుబడింది. నంచర్లగేట్ వద్ద వాహనాల తనిఖీల్లో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ గాంధీనాయక్ పాల్గొన్నారు. రూరల్ పోలీసులు భగీరథ కాలనీ వద్ద విశ్రాంత ఉద్యోగి రామ్‌లాల్ నుంచి రూ.9లక్షలు పట్టుకున్నారు. మహమ్మదాబాద్ పోలీసులు రూ.1,34,500, అడ్డాకుల టోల్ గేట్ వద్ద రూ.1.18లక్షలు సీజ్ చేశారు. సీసీకుంట రూ.2.20లక్షలు స్వాధీనం చేసుకున్నారు. దేవరకద్రలో రూ.2.22 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. కురువ చంద్రకళ ప్లాస్టిక్ కవర్లో నగదును తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. టూటౌన్ పోలీసులు హనుమాన్‌నగర్‌లో 16లీటర్ల మద్యం సీజ్ చేసి బెల్ట్ దుకాణం నిర్వహించే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దీంతో పాటు హన్వాడ, కోయిలకొండ మద్యం సీజ్ చేయగా, జడ్చర్లలో సారాతో పాటు మద్యం సీజ్ చేశారు. ఇక జిల్లాలో ఇప్పటి వరకు రూ.17,51,500నగదు, 126.4లీటర్ల మద్యం సీజ్ చేశారు.

మహమ్మదాబాద్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండల పరిధిలోని నంచర్లగేట్ క్రాస్‌రోడ్డు ప్రాంతంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు.

వనపర్తి జిల్లాలో..

పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని కొత్తపేట స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.3.47 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్ఐ వేణు తెలిపారు. ఎలాంటి రశీదు లేకుండా బొలెరో వాహనంలో వెళ్తున్న కొందరు నగదు తీసుకువెళ్తుండగా గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి రూ.50 వేలు కంటే ఎక్కువ నగదును వెంట తీసుకెళ్లాలంటే రశీదులు, బ్యాంకు కౌంటర్ ఫైల్స్ ఉండాలని ఎస్ఐ సూచించారు.

అమరచింత: జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాల తనిఖీలో రూ.1.11లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు. పెబ్బేరు నుంచి నర్వ వైపు బైక్‌పై వెళ్తున్న రామచంద్రారెడ్డిని తనిఖీ చేయగా నగదు లభించినట్లు తెలిపారు. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి 'కోటచింతల' బ్రహ్మోత్సవాలు



కోటచింతల మహానంది



లింగేశ్వర స్వామి

నవాబుపేట: మండల పరిధిలోని మరికల్ కిష్టంపల్లిగ్రామంలో కోటచింతల బసవేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు రాజేష్, రామ్మోహన్‌శర్మ, నరేందర్, పూజారి మఠం సిద్ధేశ్వర్ వివరాలను తెలిపారు. 21న రుద్రాభిషేకం , తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవం, 22న శకటోత్సవం, 23న మహా మంగళహారతి, శివపార్వతుల కల్యాణం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కాగా అగ్ని గుండం రోజు వీరశైవులు సూదూర ప్రాంతాల నుంచి ఇక్కడి వస్తుంటారు. ఉత్సవాల్లో భాగంగా నిత్యం భజన, సేవ, హరికథ, పౌరాణిక నాటికల తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మరికల్ మాజీ సర్పంచ్ పాండు, కిష్టంపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు తెలిపారు. కోటచింతల ఆలయానికి దాదాపు నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఆలయం పరిసర ప్రాంతాల్లోని పొలాల్లో ముత్యాలు, పగడాలు, నల్ల పూసలు లభిస్తాయి. కొత్తగా దంపతులు ఇక్కడికి వచ్చి వాటిని సేకరిస్తుంటారు. మహిళలు మంగళసూత్రాల్లో వీటిని అలంకరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.